


ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఖమ్మం
5
శనివారం, 15 మార్చి 2025

వెంచర్లతో వంచన

- అడ్డగోలుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం
- ప్రభుత్వ సర్వే నెంబర్లలో సైతం ఫెన్సింగ్
- ఎటూ తేల్చని అధికారులు

7



భద్రాద్రి రామాలయంలో వసంతోత్సవ సమయంలో రంగులు చల్లుకుంటున్న భక్తులు

వర్ణశోభితమై మెరిసిన భద్రగిరి

- సంప్రదాయబద్ధంగా డోలోత్సవం, వసంతోత్సవం
- కల్యాణ తలంబ్రాల తయారీకి శ్రీకారం
- రామయ్య పెళ్లి పనులు షురూ

వివరాలు : 6లో



ఆనందోత్సాహాల మధ్య హోలీ

- రంగులు చల్లుకుంటూ ఆడిపాడిన యువత
- ఉత్సాహంగా పాల్గొన్న మహిళా లోకం
- సీపీ సునీల్‌దత్ నివాసంలో సందడి చేసిన ఉన్నతాధికారులు

6



ఖమ్మంలో ఓ ప్రైవేటు ఈవెంట్ సంస్థ ఆధ్వర్యంలో హోలీ వేడుక దృశ్యం

ముమ్మరంగా 'మంచుకొండ' పనులు

- 2,412 ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యం
- పంపుహౌజ్ నిర్మాణాన్ని పరిశీలించిన మంత్రి తుమ్మల
- పనులు వేగవంతం చేయాలని ఆదేశం



వి.వెంకటాయపాలెం వద్ద మంచుకొండ ఎత్తిపోతల పంపుహౌజ్ పనులు పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో కరువు మండలంగా ఉన్న రఘునాథపాలేన్ని సస్యశ్యామలం చేసేందుకు తలపెట్టిన మంచుకొండ ఎత్తిపోతల పథకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మంత్రి తుమ్మల మంచుకొండ ఎత్తిపోతల పథకం పంపుహౌజ్ పనులను శుక్రవారం వీ.వెంకటాయపాలెం వద్ద పరిశీలించారు. ఉగాది నాటికి పనులు పూర్తిచేసి సాగునీరు విడుదల చేసే లక్ష్యంతో మంత్రి పట్టుదలగా ఈ ఎత్తిపోతలకు రూ.66.33కోట్లు నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభింప చేశారు. ఈ ఎత్తిపోతల ద్వారా 2,412 ఎకరాలకు 17 గ్రామాల్లో 27 చెరువులకు సాగునీరు అందనుంది. చెరువులను సాగర్ జలాలతో నింపడం ద్వారా భూగర్భజలాలు పెరిగి సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు 16.30 కి.మీ. వీ.వెంకటాయపాలెం నుంచి మంచుకొండవరకు పైపులైన్ పనులు కూడా చురుగ్గా సాగుతున్నాయి.

సాగర్ జలాలతో సస్యశ్యామలం

నాగార్జునసాగర్ జలాలతో రఘునాథపాలెం మండలాన్ని సస్యశ్యామలం చేయడమే నా లక్ష్యమని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. రూ.66.33 కోట్లతో చేపట్టిన ఈ పథకం పంపుహౌజ్ (మిగతా 6వ పేజీలో)



హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌తో భేటీ అయిన మంత్రి తుమ్మల

- సీతారామ, సీతమ్మ సాగర్ పనుల వేగవంతానికి కార్యాచరణ
- హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌తో తుమ్మల భేటీ

6

సస్యశ్యామల స్వప్నం సాకారం దిశగా..



టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్న లారీ (ఫైల్)

- కోట్లకు పడగలెత్తుతున్న అక్రమార్కులు
- ఖమ్మం కేంద్రంగా చక్రం తిప్పుతున్న సూత్రధారి
- మామూళ్లను పంచుతూ ఇష్టారాజ్యం
- తప్పుడు వే బిల్లులతో కాకినాడ పోర్టుకు తరలింపు
- రీ పాలిషింగ్‌తో సీఎంఆర్‌గా మార్చుతున్న వ్యాపారులు
- అడపాదడపా హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ దాడులు
- చేష్టలుడిగి చూస్తున్న స్థానిక సివిల్ సప్లయిస్ శాఖ
- అక్రమ దందాతో సర్కారు ఖజానాకు భారీగా గండి

పేదలకు సర్కారు అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. అక్రమార్కులు ప్రతిరోజూ రేషన్‌బియ్యం లారీలను దొడ్డిదారిన ఏపీలోని కాకినాడ పోర్టుకు తరలిస్తున్నారు. ఖమ్మం కేంద్రంగా రేషన్‌బియ్యం వ్యాపారి ఒకరు ఈ వ్యవహారం నడిపిస్తున్నారు. ఖమ్మంతోపాటు పొరుగున ఉన్న భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి మినీలారీలు, ఆటోల్లో ఖమ్మం తరలిస్తున్నారు. ఇక్కడ లారీల ద్వారా కొన్ని తప్పుడు వేబిల్లు పత్రాలు సృష్టించి మిల్లర్ల నుంచి కొనుగోలు చేసినట్టు చూపుతూ రవాణా సాగిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఎలాంటి వే బిల్లులు లేకుండా చెక్‌పోస్టుల వద్ద మామూళ్లు ఇచ్చుకుంటూ తరలిస్తున్నారు.

రేషన్ రైస్.. స్వాహా నైస్

అడ్డూ అదుపూ లేని రేషన్ బియ్యం దందా

ఖమ్మం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మంజిల్లాలో గత సెప్టెంబరు నుంచి సివిల్ సప్లయిస్ టాస్క్‌ఫోర్స్ బృందం సుమారు 7 లారీల్లో 2వేల క్వింటాళ్ల వరకు రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఫోన్ ద్వారా అందినసమాచారం మేరకు హైదరాబాద్ నుంచి టాస్క్‌ఫోర్స్ బృందం వచ్చి దాడులు చేసి రేషన్‌బియ్యాన్ని పట్టుకుని సివిల్ సప్లయిస్ అధికారులకు అప్పగిస్తున్నారు. వాస్తవానికి స్థానికంగా సివిల్ సప్లయిస్ అధికారులతోపాటు మండల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలు రేషన్‌షాపులు, గోదాంలపై రోజువారీ నిఘా ఉంచాలి. ఆకస్మిక తనిఖీలు చేసి బియ్యం అమ్ముతున్నారా.. స్టాకు ఉంచుతున్నారా తనిఖీ చేయాలి. కానీ డీలర్ల నుంచి, గోదాం ఇన్‌చార్జిల నుంచి నెలవారీ మామూళ్లు అందుకుని బియ్యం అక్రమ రవాణాకు సహకారం అందిస్తున్నారు.

సివిల్ సప్లయిస్ అధికారులు అక్కడక్కడ కేసులు నమోదుచేస్తున్నా.. అవి తూతూ మంత్రపు కేసులుగా మారుతున్నాయి. కఠిన చట్టాలు అమలు చేయకపోవడంతో పట్టుబడిన లారీలను వెంటనే విడుదల చేయించడం తర్వాత సాక్ష్యాలను మాయం చేసి శిక్షలు లేకుండా కేసుల నుంచి రేషన్ బియ్యం వ్యాపారులు తప్పించుకుంటున్నారు. కొణిజర్ల పోలీసులు ఏపీలోని కాకినాడ పోర్టుకు తరలిస్తున్న రెండు లారీల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. 500 క్వింటాళ్ల స్వాధీనం చేసుకున్నారు. అయితే ఈ రేషన్‌బియ్యం (మిగతా 6వ పేజీలో)

ఏడు లారీల బియ్యం పట్టుకున్నాం..

బి.అంజయ్య, సివిల్ సప్లయిస్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ



గత సెప్టెంబరు నుంచి ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు సుమారు 7లారీల్లో 2వేల క్వింటాళ్ల రేషన్‌బియ్యం పట్టుకుని అప్పగించాం. ఉమ్మడి జిల్లాలో మండలస్థాయిలో నిఘా ఉంటే రేషన్ బియ్యం అక్రమ రవాణ నివారించే అవకాశం ఉంటుంది. మేము హైదరాబాద్‌లో ఉండి రాష్ట్రవ్యాప్తంగా ఆపరేషన్ చేస్తాం. ఎవరైనా ఫోన్‌చేసి రేషన్ బియ్యం రవాణ అవుతున్నట్టు సమాచారం ఇస్తే మా టాస్క్‌ఫోర్స్ టీం వచ్చి పట్టుకుంటుంది. ఒక్కో సందర్భంలో మేం వచ్చేలోగా లారీలు వెళ్లడం, బియ్యాన్ని లోడు చేయకుండా దాచి ఉంచుతున్నారు ఎవరైనా రేషన్‌బియ్యం అక్రమరవాణ విషయం తెలిస్తే 81064 63510కు కాల్ చేసి చెప్పవచ్చు.

అప్పుడే మండుతున్న ఎండలు

- భయపెట్టిస్తున్న పగటి ఉష్ణోగ్రతలు
- 36 డిగ్రీల నుంచి 39 డిగ్రీల వరకు నమోదు



నిర్మానుష్యంగా కారేపల్లి క్రాస్ రోడ్

కొత్తగూడెం టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మార్చి నెలలోనే సూర్యభగవానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో జనం ఠారెత్తిపోతున్నారు. ఎండ తీవ్రతకు మధ్యాహ్న సమయంలో బయటకు రావాలంటేనే జంకుతున్నారు. అత్యధిక ఉష్ణోగ్రతలకు పేరుగాంచిన కొత్తగూడెం (మిగతా 6వ పేజీలో)

అరచేతిలో ఆలయం

- భక్తులకు అందుబాటులోకి భద్రాద్రి టెంపుల్ ఇన్ఫర్మేషన్ యాప్
- సకల సమాచారం నిక్షిప్తం.. త్వరలో సేవలు సైతం పొందే వీలు..
- రాష్ట్రంలోనే తొలి దేవస్థానంగా భద్రాద్రికి ఖ్యాతి

భద్రాచలం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి భద్రాద్రికి తరలివచ్చే రామభక్తుల కోసం భద్రాద్రి దేవస్థానం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఆత్రేయ ఇన్ఫోటెక్ సిస్టమ్స్‌చే భద్రాద్రి టెంపుల్ ఇన్ఫర్మేషన్ యాప్‌ను రూపొందించి శుక్రవారం రామయ్య పెండ్లి పనులు ప్రారంభం కావడం, సీతమ్మవారి జన్మనక్షత్రం కావడంతో లాంఛనంగా దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ప్రారంభించారు.

ప్రస్తుతం ఈ యాప్‌లో రామాలయంలో భక్తులకు అందుబాటులో ఉన్న వివిధ సేవలు, క్షేత్ర మహత్మ్యం, పట్టణం, పరిసరాల్లో దర్శనీయ స్థలాలు, దూరాలు, రైల్వే స్టేషన్ ఇతర వివరాలు ప్రస్తుతం పొందుపరిచారు. ఇప్పటికే డిజిటల్ సేవలు, ఆన్ లైన్ సేవలు, క్యూఆర్ కోడ్ సేవలు అందుబాటులో ఉన్నాయి. అలాగే పారదర్శకత కోసం బార్ కోడింగ్, అన్నప్రసాదంలో ఈ-టికెటింగ్ విధానం అమల్లో ఉంది. రాబోయే నెలరోజుల్లో భక్తులు ఈ యాప్ ద్వారా నేరుగా రామయ్య ఆర్జిత సేవలు, విరాళాలు, పూజలు, ఇతరత్రా వాటిని సైతం పొందేలా తీర్చిదిద్దనున్నట్లు దేవస్థానం ఈవో రమాదేవి వెల్లడించారు.

స్వామి వారి మహాప్రసాద అన్నదానంలో భాగంగా వెయ్యిమందికి అన్నప్రసాదం అందించేందుకు ప్రసాద్ పథకంలో నిర్మిస్తున్న హాల్‌ను ఇవ్వాలని కలెక్టర్‌కు విన్నవించామని తెలిపారు. ప్రొటోకాల్ విధానం ప్రవేశపెట్టడంతో పారదర్శకంగా



యాప్‌ను ఆవిష్కరించి మాట్లాడుతున్న ఈవో రమాదేవి

వివిధ ప్రభుత్వ విభాగాలతోపాటు వీఐపీలకు మంచి దర్శనం అందుతోందని అలాగే దేవస్థానానికి ఆదాయం సమకూరుతోందన్నారు. వస్త్రాలకు బార్‌కోడింగ్ ప్రవేశపెట్టడం ద్వారా సత్ఫలితాలు వస్తున్నాయని భక్తులకు సైతం దేవస్థానం నిర్దేశించిన ధరకే వస్త్రాలను విక్రయించాలని స్పష్టం చేసినట్టు తెలిపారు.

ఇదిలా ఉండగా డిజిటలైజేషన్ ఆన్‌లైన్, బార్‌కోడింగ్, ప్రత్యేక యాప్‌లు భక్తులకు అందుబాటులోకి తెచ్చిన తొలి దేవస్థానంగా భద్రాద్రి ఖ్యాతినార్జించిందన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రావణ్‌కుమార్, భవానీ రామకృష్ణారావు, ఇంజనీరింగ్ ఈఈ రవీంద్రనాథ్, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు కోటి రామస్వరూప్ రాఘవాచార్య, రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు, సీసీ శ్రీనివాసరెడ్డి, ఆత్రేయ ఇన్ఫోటెక్ సిస్టమ్స్ ఎండీ ఎ.రమేషన్ పాల్గొన్నారు.

లక్ష్య సాధనలో మెరిసిన అన్నదమ్ములు

- పెద్దోడికి నాలుగు, చిన్నోడికి ఐదు ఉద్యోగాలు
- తమ్ముడికి గ్రూప్-3లో 27వ ర్యాంక్
- ఆదర్శంగా నిలుస్తున్న సాయిక్రిష్ణమ నాయుడు, రత్నేశ్వర నాయుడు



సాయిక్రిష్ణమ నాయుడు, రత్నేశ్వర నాయుడు

కామేపల్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఆ అన్నదమ్ములు ఉన్నత ఉద్యోగం సాధించాలని చిన్నప్పటి నుంచే కలలు కన్నారు. వారి ప్రయత్నానికి పట్టుదల తోడవడంతో ఇప్పటివరకు అన్నకు నాలుగు, తమ్ముడికి ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయి. కామేపల్లి మండలం గోవింద్రాల బంజరకు చెందిన ఆదర్శ రైతు గంగారపు సత్యనారాయణ, జోతిర్మయిల కుమారులు సాయిక్రిష్ణమనాయుడు, రత్నేశ్వర నాయుడు ఏడో తరగతి వరకు గోవింద్రాలలో చదువుకున్నారు. అనంతరం ఖమ్మం, హైదరాబాద్‌లో చదువుకున్నారు. సోదరులిద్దరు ఆరు నెలలపాటు ఓ ప్రైవేట్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందారు. అనంతరం హైదరాబాద్‌లోనే ఉంటూ లైబ్రరీలో (మిగతా 6వ పేజీలో)

ఏకులపోతమ్మ తిరునాళ్లు ప్రారంభం

పూజలు చేసిన మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే జారే, మువ్వా



ఆలయంలో మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే జారే, ఐడీసీ చైర్మన్ మువ్వా

దమ్మపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొద్దులగూడెం క్రాస్‌రోడ్ వద్ద గల ఏకులపోతమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం మూడు రోజు లపాటు నిర్వహించే కార్యక్రమాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో కలశస్థాపన, అఖండ ప్రజ్వలన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తిరునాళ్ల మహోత్సవం ఆదివారం వరకు జరగనుంది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు వేర్వేరుగా పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దొడ్డా ప్రసాద్, కొయ్యల అచ్యుత రావు, కేవీ సత్యనారాయణ, కాసాని నాగప్రసాద్, ఎర్రా వసంతరావు, కాసాని మంగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ వాసం రాణి, బాలశేషుబాబు, దొడ్డా రమేష్, దొండపాటి రామారావు, ములగలపాటి ప్రసాద్, చిన్నంశెట్టి యుగంధర్, వాసం శ్రీను, పర్వతనేని ప్రసాద్, తదితరులు పాల్గొని పూజలు చేశారు.

వైభవంగా స్వామివారి కల్యాణం

జ్వాలా లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న భక్తులు, ఎమ్మెల్యే పాయం



జ్వాలా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

కరకగూడెం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : బుర్దారం కారడవిలో వెలసిన శ్రీ సువర్ణగిరి జ్వాలా లక్ష్మీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం మధ్యాహ్నం 12:30 నిమిషాలకు ఘనంగా జరిగింది. ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీలతో స్వామివారి కల్యాణం కన్నుల పండువగా సాగింది. ఈ కార్యక్రమాన్ని ఆలయ పూజారులు పోలెబోయిన రవితేజ, నరసింహమూర్తి ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. కల్యాణానికి ముందు స్వామివారి పట్టువస్త్రాలు పోలెబోయిన వంశీయులు తీసుకొచ్చారు. స్వామివారి కల్యాణం తిలకించేందుకు భక్తులు భారీగా తరలి వచ్చారు. జ్వాలా లక్ష్మీనరసింహస్వామిని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



వసంతోత్సవ వేళ మురిసిన భద్రాద్రి

- సంప్రదాయబద్ధంగా డోలోత్సవం
- కల్యాణ తలంబ్రాల తయారీకి శ్రీకారం
- సహస్రధారతో ఉత్సవమూర్తులకు ప్రత్యేక స్నపనం
- తలంబ్రాలను సమర్పించిన భక్త బృందాలు
- రామయ్య పెళ్లి పనులు షురూ

భద్రాచలం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కల్యాణకారకుడైన భద్రాచల రామచంద్రమూర్తికి ఫాల్గుణ పూర్ణిమను పురస్కరించుకొని వసంతోత్సవం, డోలోత్సవం కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. గురువారం రాత్రి అంకురార్పణతో ప్రారంభమైన కార్యక్రమం శుక్రవారం రామచంద్రమూర్తికి విశేష స్నపనం నిర్వహించారు. ఏప్రిల్ ఆరున భద్రాచలంలోని మిథిలాస్టేడియం ప్రాంగణంలో ఉన్న కల్యాణ మండపం వేదికగా అంగరంగ వైభవంగా నిర్వహించే స్వామివారి కల్యాణానికి అవసరమైన తలంబ్రాల తయారీ ప్రక్రియ కల్యాణ పనుల చిహ్నంగా పసుపు కొమ్ములను ఉత్తరద్వారం వద్ద రోటిలో వేసి సంప్రదాయబద్ధంగా వైదిక మంత్రాలతో పసుపును దంచారు. అదేవిధంగా స్థానిక నిత్యకల్యాణ మండప వేదిక వద్ద స్వామివారికి డోలోత్సవం, వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆస్థాన విద్వాంసులు రామదాసు, తూము నరసింహదాసు కీర్తనలు ఆలపిస్తుండగా నక్షత్ర, కుంభ హారతులను స్వామివారికి సమర్పించారు.

వరాల రామునికి వసంతోత్సవం

హోలీ పౌర్ణమినాడు డోలోత్సవం, వసంతోత్సవం నిర్వహించడం ఆగమ సంప్రదాయం. అయితే స్థానిక ప్రజలు, భక్తులు భద్రాద్రి రామయ్యకు వసంతం చల్లిన రోజున పెళ్లి కొడుకుగా రామయ్యను ముస్తాబు చేసినట్లు ఈ ప్రాంతవాసులు భావిస్తారు. ముందుగా ప్రధాన ఆలయంలోని ధ్రువమూర్తులకు, గోదాదేవి అమ్మవారికి, లక్ష్మీతాయారు అమ్మవారికి, ఆంజనేయస్వామి వారికి వసంతాన్ని శాస్త్రోక్తంగా చల్లి అనంతరం కల్యాణమూర్తులపై చల్లారు. చివరగా భక్తులపై వసంతోత్సవానికి చిహ్నంగా పసుపు నీళ్లను చల్లారు. సాయంత్రం శ్రీసీతారామచంద్ర లక్ష్మణ స్వాములకు బాజ భజంత్రీలతో తిరువీధి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, ఏఈవోలు శ్రావణ్‌కుమార్, భవానీరామకృష్ణారావు, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు పొడిచేటి అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధానఅర్చకులు కోటిశ్రీమన్నారాయణాచార్యులు, అమరవాది శ్రీనివాస రామానుజం, ఇతర వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

తలంబ్రాల తయారీ ప్రారంభం

రామయ్య కల్యాణంలో వినియోగించే తలంబ్రాల తయారీ కార్యక్రమానికి సైతం శుక్రవారం శ్రీకారం చుట్టారు. స్థానిక మిథిలా స్టేడియంలో సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా కల్యాణ కార్యక్రమంలో పాల్గొనే రుత్వికుల సతీమణులచే పసుపును రోట్లో దంచారు. అలాగే తలంబ్రాలను సైతం వారు కలిపారు. అనంతరం పసుపు, కుంకుమ, నెయ్యి, బుక్కగులాల్, అత్తర్, పన్నీర్, నూనె, సుగంధ ద్రవ్యాలులు కలిపి తలంబ్రాలను సిద్ధం చేశారు. తొలిరోజున 25 క్వింటాళ్ల తలంబ్రాలను సిద్ధం చేయగా మొత్తంగా 300 క్వింటాలను తయారు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా, గోటి తలంబ్రాలను శిరస్సుపై ధరించి భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయానికి అధిక సంఖ్యలో మహిళా భక్తులు రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి తరలి రావడం జరిగింది. పాదయాత్రగా వాహనాల్లో తరలివచ్చిన భక్తులు పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణ తలంబ్రాల తయారీలో సైతం మమేకమయ్యారు.



తలంబ్రాలను కలుపుతున్న భక్తులు, ఈవో

హోలీ... రంగేలి

- లోక్యాతండాలో ప్రారంభమైన హోలీ వేడుకలు
- తొలి రోజున ఆకట్టుకున్న కోలాట వేడుక
- పెద్దసంఖ్యలో పాల్గొన్న గిరిజనులు



కూసుమంచి మండలం లోక్యాతండాలో కోలాటం వేస్తున్న తండావాసులు

కూసుమంచి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లోక్యాతండ, జగమాల్‌తండాలో హోలీ సంబురాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇక్కడ మూడురోజుల పాటు హోలీ వేడుకలు ఘనంగా జరుగుతాయి. సాధారణంగా ప్రతిగ్రామంలో ఒక్కరోజు మాత్రమే జరుపుకొనే ఈ పండుగను ఇక్కడ మాత్రం ఒక ప్రత్యేకతగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. హోలీని పురస్కరించుకుని వివిధ గ్రామాలనుంచి పెద్దఎత్తున బంధువులు, కుటుంబసభ్యులు ఇక్కడకు చేరుకున్నారు. దీనిలో భాగంగా సాయంత్రం పెద్దఎత్తున కోలాటం వేడుకను జరుపుకొన్నారు. చిన్నపెద్ద తారతమ్యం లేకుండా అందరు కలిసి కోలాట వేడుకల్లో పాల్గొన్నారు. దీంతో తండాలో కోలాహలం నెలకొంది. ఒకరినొకరు పట్టుకుని వలయాకారంలో కర్రలతో నృత్యాలు చేసుకుంటూ గిరిజన సాంప్రదాయ పాటలు పాడారు. దీంతో ఈ దృష్యం చూడముచ్చటగా ఉంది. సుమారు రెండుగంటలకు పైగా కోలాటం ఆడటం విశేషం. గ్రామపెద్దలు జర్పుల బాలాజీనాయక్, రామచంద్రునాయక్, వడిత్య సేట్‌రామ్‌నాయక్ , గేరియా సామ తదితరులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల్లో ఉంటూ ఉన్నత ఉద్యోగాలు చేసేవారు సైతం హోలీ సందర్భంగా స్వగ్రామం లోక్యాతండ చేరుకుని వేడుకల్లో పాల్గొని ఆడిపాడటం విశేషం. కార్యక్రమంలో సాంప్రదాయ వేషధారణలో యువకులు ప్రధానాకర్షణగా నిలిచారు.

శ్రీరామనవమికి తపాల శాఖ ప్రత్యేక సేవలు

మార్చి 12 నుంచి ఏప్రిల్ ఒకటి వరకు నమోదుకు అవకాశం

భద్రాచలం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో ఈసారి ఏప్రిల్ ఆరున నిర్వహించే శ్రీరామనవమికి తపాల శాఖ ద్వారా ప్రత్యేక సేవలు భక్తులకు అందించనున్నారు. వివిధ కారణాలతో ప్రత్యక్షంగా రాలేని భక్తుల కోసం సేవ పూజలను అందుబాటులోకి తెచ్చింది. అంతరాలయ అర్చన, కల్యాణ తలంబ్రాలకు రూ.450, ముత్యాల తలంబ్రాలు రూ.150 ధర నిర్ణయించినట్లు భారత తపాల శాఖ ఖమ్మం డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ వీరభద్రస్వామి, భద్రాచలం పోస్టుమాస్టర్ బీవీ రామ్మోహన్‌రావు తెలిపారు. ఈ సేవలు మార్చి 12 నుంచి ఏప్రిల్ ఒకటి వరకు నమోదు చేసుకునేందుకు భక్తులకు అవకాశం ఉందని వారు వెల్లడించారు.

లక్ష్య సాధనలో మెరిసిన అన్నదమ్ములు

(5వ పేజీ తరువాయి)

చదువుకుంటూ సాయిక్రిష్ణమనాయుడు నాలుగు ఉద్యోగాలు, రత్నేశ్వర నాయుడు ఐదు ఉద్యోగాలు సాధించి ఔరా అనిపించుకున్నారు.

ఇంటికి పెద్దవాడయిన సాయిక్రిష్ణమనాయుడు తొలుత కోర్టులో ఉద్యోగం సాధించాడు. వెంటనే జాబ్‌లో చేరి ఉన్నత ఉద్యోగాలపై దృష్టి సారించాడు. ఈ క్రమంలో డీఎంహెచ్‌వో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం ఆ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల నిర్వహించిన గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలు రాశాడు. వాటిలో గ్రూప్-3లో 578వ ర్యాంక్, జోన్‌పరంగా 67వ ర్యాంక్ సాధించాడు. గ్రూప్-2లో 898వ ర్యాంక్ సాధించాడు. గ్రూప్-1లో మాత్రం 435 మార్కులు సాధించాడు. దీంతో ఇతడు నాలుగు ఉద్యోగాలకు ఎంపికైనట్లయింది.

రెండో కుమారుడు రత్నేశ్వర నాయుడు గతంలో కోర్టులో ఉద్యోగం సాధించాడు. దాన్ని వదిలివేసి సీటీవోలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం రావడంతో అందులో జాయిన్ అయి ఉద్యోగంలో కొనసాగుతున్నాడు. గ్రూప్-1లో 467 మార్కులు సాధించాడు. గ్రూప్-2లో 197వ ర్యాంక్ సాధించాడు. శుక్రవారం విడుదల చేసిన గ్రూప్-3 ఫలితాల్లో 27వ ర్యాంక్, జోనల్ వైజ్‌గా 4-వ ర్యాంక్ సాధించాడు. దీంతో ఇతడు ఐదు ఉద్యోగాలు సాధించినట్లయింది. ఉద్యోగాలు రావడం పట్ల గ్రామస్థులు వారిని అభినందించారు.

ఏడాదిలో ఏడు ఉద్యోగాలు

సింగరేణి కార్మికుడి తనయుడి విజయపథం



కొత్తగూడెం టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ఓ సింగరేణి కార్మికుడి తనయుడు ఏడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి చరిత్ర సృష్టించాడు. సింగరేణి కార్మికుడిగా, కార్మిక సంఘం నాయకుడిగా పని చేస్తున్న రజాక్ రెండో కుమారుడు మహ్మద్ హఫ్రీద్ ఈ ఏడాది నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో పలు ఉద్యోగాలు సాధించాడు. సింగరేణి యాజమాన్యం నిర్వహించిన పరీక్షల్లో జూనియర్ అసిస్టెంట్ పోస్టును సాధించిన హఫ్రీద్... ఇటీవల ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో 448 మార్కులు సాధించాడు. గ్రూప్-2లో 377 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 313వ ర్యాంకును సాధించాడు. గ్రూప్-3 పరీక్షలో రాష్ట్రస్థాయిలో 22వ ర్యాంకును సాధించగా జూనియర్ లెక్చరర్ పోస్టుల ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 21వ ర్యాంకును సాధించాడు. ఆర్‌ఆర్‌బీ, ఎన్‌టీపీసీ కంపెనీల్లో సైతం ప్రతిభన కనబర్చి ఉద్యోగాలను సాధించాడు. ఏడాది కాలంలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపించి ఉద్యోగాలు సాధించిన హఫ్రీద్‌ను పలువురు అభినందిస్తున్నారు.

గోపాలరావుకు వరుస కొలువులు

గ్రూప్ 3 జోనల్ స్థాయిలో సౌమ్యకు 25వ ర్యాంకు



బోనకల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకీపురం గ్రామానికి చెందిన కోట గోపాలరావును వరుసగా కొలువులు వరిస్తున్నాయి. ఏకంగా ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం విశేషం. గోపాలరావు సివిల్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తూనే పోటీ పరీక్షలు రాయడాన్ని కొనసాగించాడు. ఎక్సైజ్ కానిస్టేబుల్ కొలువు రావడంతో శిక్షణ పూర్తి చేసుకుంటున్న సమయంలో, గ్రూప్-4 పరీక్షల్లో ప్రతిభ చాటి జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికై మధిర తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్నాడు. గ్రూప్-2 పరీక్షలు రాయగా జోనల్ ఎస్సీ కేటగిరీలో 6వ ర్యాంకు వచ్చింది. తాజాగా విడుదలైన గ్రూప్ 3 ఫలితాల్లో రాష్ట్రంలో ఎస్సీ కేటగిరిలో 17వ ర్యాంకు, జోనల్‌లో 3వ ర్యాంకు వచ్చింది. గ్రూప్-2, 3లలో ఉద్యోగాలు వస్తుండటంతో గోపాలరావును పలువురు అభినందిస్తున్నారు.



ఇక గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన కళ్యాణపు సౌమ్య అదే మండలంలోని రామాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్నారు. గ్రూప్ 2 పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో 533వ ర్యాంకు, జోనల్‌లో 25వ ర్యాంకు సాధించింది. గ్రూప్-3 పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో 191వ ర్యాంకు, జోనల్ మహిళల కోటాలో 2వ ర్యాంకు సాధించింది. వరుసగా మూడు ఉద్యోగాలకు ఎంపిక కావడంతో పలువురు అభినందిస్తున్నారు.

ఆనందోత్సాహాల మధ్య హోలీ

ఖమ్మం ఖానాపురం హవేలి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రంగులు జిగేల్‌మన్నాయి.. ఆనందోత్సాహాలు సప్తవర్ణశోభితమై ఉప్పొంగాయి. హోలీ వేడుకలు శుక్రవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. చిన్నా, పెద్ద తారతమ్యం లేకుండా అన్ని వర్గాల వారు రంగులు చల్లుకుంటూ హోలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో మహిళలు సైతం పెద్ద ఎత్తున వేడుకల్లో పాల్గొన్నారు. యువకులు ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ వేడుకలు జరుపుకొన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. వేడుకల అనంతరం మధ్యాహ్నం యువత బావులు, వాగులు, సాగర్ కాలువ, మున్నేరు ప్రాంతాల్లో ఈత కొడుతూ సందడి చేశారు. మార్వాడీలు పెద్దఎత్తున హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. వివిధ పార్టీల రాజకీయ నాయకులు, కార్మిక సంఘాల నాయకులు వేడుకల్లో పాల్గొన్నారు. నగరంలోని గాంధీచౌక్, మిర్చి మార్కెట్, కూరగాయల మార్కెట్, అజీజ్ గల్లీ, కమాన్‌బజార్, పారిశ్రామిక ప్రాంతాలతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి.

మమతారోడ్‌లోని ట్యాంక్‌బండ్‌లో....

నగరంలోని మమతారోడ్‌లోని ట్యాంక్‌బండ్‌లో శుక్రవారం ఓ ప్రైవేటు ఈవెంట్ సంస్థ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యువతీ, యువకులు అధిక సంఖ్యలో హాజరై వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. డీజే సౌండ్‌లతో, వాటర్ స్ప్రేలతో యువతీ, యువకులు కేరింతలు కొడుతూ సంబరాల్లో మునిగితేలారు. ఇదే రోడ్డులో మరో ప్రైవేటు ఈవెంట్ వారు కూడా కార్యక్రమం నిర్వహించారు.

సీపీ నివాసంలో...

ఖమ్మం క్రైం (ఆంధ్రజ్యోతి): నగరంలోని సీపీ సునీల్‌దత్ నివాసంలో హోలీ సంబురాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో అదనపు కలెక్టర్ పి.శ్రీజ, శిక్షణ అదనపు కలెక్టర్ శ్రేష్ఠ, మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా అటవీఅధికారి సిద్ధార్థ విక్రం సింగ్, జడ్పీ సీఈవో దీక్షారైనా, ట్రెయినీ ఐపీఎస్ సాయిరుత్విక్ తమ కుటుంబసభ్యులతో వేడుకల్లో పాల్గొని సందడి చేశారు.

కొత్తగూడెంలో...

కొత్తగూడెం సాంస్కృతికం(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా శుక్రవారం హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, మణుగూరు, అశ్వారావుపేట నియోజకవర్గాల్లోని గ్రామాల్లో ప్రజలు హోలీ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. యువకులు రోడ్లపైకి వచ్చి రంగులు పూసుకుని చిందులు వేశారు. కార్మిక ప్రాంతమైన రుద్రంపూర్, రామవరం ప్రాంతాలతో పాటు చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల్లో ప్రజలు, ప్రజాప్రతినిధులు రంగులు చల్లుకుని ఆనందంగా గడిపారు. కాగా కొత్తగూడెంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రోహిత్‌రాజ్ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు.

రేషన్ రైస్.. స్వాహా నైస్..

(5వ పేజీ తరువాయి)

ఏపీకి తరలిస్తున్నప్పటికీ, బియ్యం వ్యాపారులు ఇవి కరీంనగర్‌కు వెళుతున్నాయంటూ లారీ డ్రైవర్లతో తప్పుడు సమాచారం చెప్పించినట్లు తెలిసింది. అయితే బియ్యం కాకినాడ పోర్టుకు వెళుతున్నాయా, రైస్‌మిల్లర్లు సీఎంఆర్ బియ్యంగా రీ పాలీషింగ్ కోసం కొనుగోలు చేసి తీసుకెళుతున్నారా అన్నది తేలాల్సి ఉంది. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, నల్గొండ జిల్లాల నుంచి రేషన్‌బియ్యం ప్రతిరోజు ఖమ్మం జిల్లా మీదుగా కాకినాడ పోర్టు ద్వారా ఇతర దేశాలకు పోర్టు ద్వారా రవాణ అవుతున్న విషయం విదితమే. మరికొన్ని చోట్ల రేషన్‌బియ్యాన్ని రైస్ మిల్లర్లు కొనుగోలు చేసి రీ పాలీషింగ్‌తో సీఎంఆర్ ధాన్యం బియ్యం కోటాలో రీ పాలీషింగ్ చేసి తరలిస్తున్నారు.

బియ్యం దందా ఇలా...

ప్రభుత్వం అందించే రేషన్‌బియ్యాన్ని పేద, మధ్య తరగతివర్గాలు చాలామంది తినడంలేదు. ఎక్కువమంది రేషన్‌డీలర్‌కే ఇచ్చి కేజీకి రూ.6 నుంచి 8 తీసుకుంటున్నారు. రేషన్‌డీలర్లు ఖమ్మంలోని రేషన్‌బియ్యం వ్యాపారికి రూ.10 నుంచి 12 వరకు కేజీ అమ్ముతున్నారు. రేషన్‌బియ్యం వ్యాపారి ఇలా కొనుగోలు చేసిన బియ్యాన్ని రూ.15 నుంచి 20కు ఏపీలోని పోర్టు నుంచి ఇతర దేశాలకు బియ్యం సరఫరా చేసే కంపెనీలకు విక్రయిస్తున్నారు. ఇక్కడ కొనుగోలు చేసిన రేషన్‌బియ్యంను లారీల ద్వారా అక్కడి గోదాంలకు నేరుగా పోర్టులకు తరలించడం వీరి విధి. కాకినాడ పోర్టునుంచి కిలో బియ్యం రూ.30 నుంచి పైగా విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. అలాగే రేషన్‌బియ్యాన్ని రైస్ మిల్లర్లు కొనుగోలు చేసి సివిల్ సప్లయాస్ శాఖకు సీఎంఆర్ బియ్యంగా రీ పాలిషింగ్ చేసి పంపిస్తున్నారు. మరికొన్ని రేషన్‌బియ్యం నూకలు వేసి వాటిని చేపల చెరువులకు రవాణ చేస్తుండగా, విదేశాలకు సైతం బియ్యం నూక రవాణ అవుతోంది. మరికొందరు బీరు వంటి మద్యపానీయాలను తయారు చేస్తున్నారు. ప్రభుత్వ శాఖల అధికారులకు, గోదాం ఇన్‌చార్జిలకు, చెక్‌పోస్టుల సిబ్బందికి బియ్యం వ్యాపారులు మామూళ్లు ఇవ్వడం లారీలను తరలించడం, ఒక వ్యాపారంగా మారింది. ఖమ్మం జిల్లా పరిధిలో 4 లక్షల 11 వేల రేషన్ కార్డులున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2 లక్షల 93వేల రేషన్ కార్డులున్నాయి. ఒక్కొక్కరికి 5 కేజీల చొప్పున రేషన్ బియ్యం పంపిణీ జరుగుతుంది. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభత్వాలు కేజీ బియ్యానికి రూ.30 నుంచి 35 వరకు ఖర్చు చేస్తున్నాయి.

అప్పుడే మండుతున్న ఎండలు

(5వ పేజీ తరువాయి)

పట్టణంలో గత వారం రోజులుగా 36 నుంచి 39 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ ప్రాంతంలో సింగరేణి మైన్స్, ఓపెన్‌కాస్టులు ఉండటంతో రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని జనం ఆందోళన చెందుతున్నారు. మార్చి నెలలోనే పరిస్థితి ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఎలా ఉంటుందోనని ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఓపెన్ కాస్టుల్లో ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కార్మిక సంఘాల నాయకులు సింగరేణి యాజమాన్యాన్ని కోరుతున్నారు. ముందస్తుగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మరోవైపు వేసవి కాలంలో మంచినీటి ఎద్దడి ఏర్పడకుండా పట్టణ, పల్లె ప్రాంతాల్లో యాక్షన్‌ప్లాన్‌న్లు సిద్ధం చేసే పనిలో అధికారులు ఉన్నారు. ఇప్పటికే మంచినీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. కొత్తగూడెం మునిసిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన సుజాత.. పట్టణానికి కిన్నెరసాని నీటి సరఫరాపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.



సస్యశ్యామల స్వప్నం

సాకారం దిశగా..

ఖమ్మం, మార్చి14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సీతారామ ఎత్తిపోతల పథకంతోపాటు సీతమ్మసాగర్ ప్రాజెక్టు పనులను సత్వరం పూర్తయ్యేలా కార్యచరణ రూపొందించాలని రాష్ట్ర భారీనీటిపారుదలశాఖ మంత్రిఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్ణయించారు. హైదరాబాదులో మంత్రి తుమ్మల... ఉత్తమ్‌తో భేటీ అయి సీతారామ ఎత్తిపోతల,సీతమ్మసాగర్‌లపై చర్చించారు. భవిష్యత్ కార్యచరణ పనులు గురించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. సత్తుపల్లి ట్రంక్‌కెనాల్, సీతారామ ప్రాజెక్టు పురోగతి, భూసేకరణ వంటి అంశాలపై చర్చించారు. సత్తుపల్లి ట్రంక్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, పంపుహౌజ్-4 నిర్మాణాన్ని కూడా ఈఏడాది పూర్తిచేయాలని నిర్ణయించారు.

భూసేకరణ ప్రక్రియ సత్వరం పూర్తిచేసేందుకు ఇరు జిల్లాల కలెక్టర్లను ఈ సందర్భంగా ఆదేశించారు. పని నాణ్యత, ఖర్చు నియంత్రణ, సమయపాలన పై అధికారు లు, కాంట్రాక్టర్లు సంబంధిత శాఖలు దృష్టిపెట్టేలా చర్యలు తీసుకోవాలని,సాంకేతిక పరిజ్ఞానం పరిశీలించి పనులు వేగంగా జరపాలని, ప్రాజెక్టు పనుల్లో ఏదైనా సమస్యతలెత్తితే సమాచారాన్ని వెంటనే అందించేలా అధికారులు చొరవ తీసుకోవాలని అక్కడే ఉన్న నీటిపారుదలశాఖ అధికారులకు సూచించారు.సీతమ్మ సాగర్ బ్యారేజీ మూడేళ్లలో పూర్తిచేయాలని లక్ష్యం పెట్టుకోవాలని, ఈ బ్యారేజీ ద్వారా 600 మెగావాట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని మంత్రి తుమ్మల తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలతో సీతారామ ప్రాజెక్టు సస్యశ్యామలం చేయబోతుందని, కృష్ణాజలాలు రాకపోయినా గోదావరి జలాలతో సాగర్ ఆయకట్టునుస్థిరీకరించవచ్చని తుమ్మల తెలిపారు. జూలూరుపాడు టన్నెల్ పూర్తయితే పాలేరు రిజర్వాయర్‌కు గోదావరి నీరు చేరి ఉమ్మడి నల్గొండ జిల్లాకు కూడా సీతారామ వరప్రదాయని అవుతుందని, తుమ్మల వివరించారు.

ముమ్మరంగా 'మంచుకొండ' పనులు

(5వ పేజీ తరువాయి)

పనులను వి.వెంకటాయపాలెం వద్ద మంత్రి తుమ్మల శుక్రవారం తిలకించారు. నీటిపారుదలశాఖ ఈఈ అనన్య, డీఈ ఝాన్సీ, ఏఈ శ్రీరామ్ తదితరులతో మంత్రి తుమ్మల పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పైపులైన్ పనులు చివరిదశలో ఉన్నాయని, ఈనెల 25 లోగా పంపుహౌజ్ పనులు పూర్తి చేయిస్తామని, తెలిపారు. పంపుహౌజ్ వద్ద కంట్రోల్‌ప్యానల్స్, ప్రెజర్ మెయిన్స్, మోటార్ల ఏర్పాటు స్థలాన్ని మంత్రి తిలకించారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ రఘునాథపాలెం మండల వ్యవసాయభూములు ఎత్తైన ప్రదేశంలో ఉండడంతో, ఇప్పటి వరకు సాగునీరు లేకుండా ఉందని నాగార్జునసాగర్ కాలువ వీ.వెంకటాయపాలెం లిఫ్టు ద్వారా తరలించి మంచుకొండలో ఎత్తైన ప్రదేశంలో నీటిని విడుదల చేయడం జరుగుతుందని, తద్వారా చెరువులకు సాగర్‌జలాలు అంది రెండుపంటలు పండించే అవకాశం రైతులకు కలుగుతుందని తెలిపారు. మంత్రి వెంట ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, రఘునాథపాలెం సొసైటీ చైర్మన్ తాతా రఘురాం, వీ.వెంకటాయపాలెం సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదుబాబు, ఆత్మ కమిటీ చైర్మన్ దిరిశాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



బంగారు కిరీటాలను అందజేస్తున్న జయశేఖర్ దంపతులు

సంతాన వేణుగోపాలుడికి బంగారు కిరీటాలు

బూర్గంపాడు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బూర్గంపాడు మండల పరిధిలోని ఇరవెండిలో గోదావరి ఒడ్డున కొలువై ఉన్న శ్రీ సంతాన వేణుగోపాలస్వామి వారిని శుక్రవారం తాళ్లూరి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు తాళ్లూరి పంచాక్షరయ్య కుమారుడు తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్-నీలిమ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి రూ.25లక్షల విలువైన మూడు బంగారు కిరీటాలు, కల్యాణంలో భాగంగా పట్టు వస్త్రాలను ఆలయ అర్చకులకు అందజేశారు. స్వామివారికి బంగారు కిరీటాలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. గత నెలలో శివరాత్రి పర్వదినాన మోతెగడ్డలో కొలువై ఉన్న వీరభద్రస్వామి వారికి రూ.20లక్షల విలువైన బంగారు కిరీటాలను జయశేఖర్ దంపతులు ఆలయ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి పంచాక్షరయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వల్లూరిపల్లి వంశీకృష్ణ పాల్గొన్నారు.



పాలకోయ తండా సమీపంలోనే ఓ వెంచర్

వెంచర్లతో వంచన

- అడ్డగోలుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం
- ప్రభుత్వ సర్వే నెంబర్లలో సైతం ఫెన్సింగ్
- ఎటూ తేల్చని అధికారులు

పాల్వంచ రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచలో ఎటువైపు చూసిన రియల్టర్లు వేసిన వెంచర్లే కనిపిస్తున్నాయి. మరికొన్ని చోట్ల మనస్సును ఆకర్షించే పేర్లతో హోర్డింగ్స్ పెట్టి బిల్డర్లు అపార్టుమెంట్లను నిర్మిస్తున్నారు. అసలు ఇవి అక్రమమా.. సక్రమమా అనే అనుమానాలు సర్వత్ర వ్యక్తమవుతున్నాయి. పాల్వంచలోని నాలుగు సర్వే నెంబర్లు 444, 999, 817, 727లో ఉన్న ప్రభుత్వ భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వేస్తున్న వెంచర్లపై అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

పాల్వంలో భూముల విలువలు సామాన్య, మధ్య తరగతి, చిన్నస్థాయి ఉద్యోగులు కొనలేని స్థాయికి చేరాయి. ప్రభుత్వ భూములను కూడా రియల్టర్లు వదిలి పెట్టడం లేదు. అడ్డదారుల్లో రెవెన్యూ అధికారుల సాయంతో రికార్డులను తారుమారు చేయించి హక్కుదారులుగా చలామణిలోకి వస్తున్నారు. బై నెంబర్లతో రికార్డుల్లో నమోదు చేయించి దర్జాగా క్రయవిక్రయాలు చేస్తున్నట్లు చర్చ సాగుతోంది. ఇటీవల పాలకొయతండ, శేఖరంబంజర్, కేటీపీఎస్ సరిహద్దు ప్రాంతాలతోపాటు భద్రాచలం హైవే మండలం శివారులోని సీతానగర్‌కాలనీ సమీపంలో భారీ స్థాయిలో వెంచర్లు వేశారు. అపార్టుమెంట్లను నిర్మిస్తున్నారు. చుట్టూ ఫెన్సింగ్, పక్కా రోడ్లు, ఇరువైపులా చెట్లు నాటి అక్కడక్కడా హోర్డింగ్స్ ఏర్పాటు చేశారు. పలుచోట్ల ఫెన్సింగ్ పనులు కొనసాగుతున్నాయి. ఈ వెంచర్లన్నీ ప్రభుత్వ భూమి ఉన్న సర్వే నెంబర్లు 444, 999, 817, 727లో ఉన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అసలు భూమి ఇదీ..

మండల రెవెన్యూ భూ రికార్డుల ప్రకారం సర్వేనెం. 444లో 853 ఎకరాలు, 999లో 8,296 ఎకరాలు, 817లో 2,480 ఎకరాలు 727లో 1,314 ఎకరాలు మొత్తంగా 8,855 ఎకరాలు భూములు ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఉన్నాయి. ఈ భూముల పై అధికారులు దాసీనత చూపడంతో గత కొంతకాలంగా అన్యాక్రాంతం అవుతున్నాయి. ఈ సర్వే నెంబర్లలోని భూములపై నేటికి అధికారులు సర్వే చేసి హద్దులు నిర్ణయించకపోవడం గమనార్హం. ఈ భూముల్లో వెలిసి వెంచర్స్ అక్రమమా.. సక్రమమా.. అనే అనుమానాలకు రెవెన్యూ అధికారులు చెక్‌పెట్టాల్సి ఉంది.

వెంచర్ల భూములను పరిశీలిస్తాం
వివేక్, తహసీల్దార్



పాల్వంచలో ఉన్న వెంచర్లను పరిశీలిస్తాం. సర్వే నెంబర్లు 444, 999, 817,727ల్లో ప్రభుత్వ భూమి మొత్తం 8,855 ఎకరాలు ఉంది. ప్రభుత్వ భూముల్లో వెంచర్స్ ఉంటే వెంటనే చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటాం.

ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలను నెరవేర్చడమే ధ్యేయం

- ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి విజయం చరిత్రాత్మకం
- పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాసరావు



బోనకల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలను నెరవేర్చడమే ధ్యేయంగా ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి పని చేస్తారని ఆ సంఘ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రెబ్బా శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తమ సంఘ ఎమ్మెల్సీ విజయం చరిత్రాత్మకంగా అభివర్ణించారు. రెండున్నర దశాబ్దాలకు పైగా తాను సంఘంలో పలు పోరాటాల్లో పాల్గొన్నానని, కాని ఇటీవల ఎమ్మెల్సీ గెలుపు కోసం పని చేయడం ఎంతగానో సంతృప్తిని ఇచ్చిందన్నారు. ఇందుకోసం పని చేసిన పీఆర్టీయు కుటుంబ సభ్యులతో పాటు విజయానికి పరోక్షంగా సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల పెండింగ్ డీఏలు, బిల్లులు, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్, గురుకులాలు, కస్తూర్బా పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయుల సమస్యల పై తాను ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డితో చర్చించగా, అన్ని సమస్యలను పరిష్కరించేలా కృషి చేస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

ఘనంగా వసంతోత్సవం, దొంగల దోపోత్సవం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న దృశ్యం

వేంసూరు, మార్చి14 (ఆంధ్రజ్యోతి): వేంసూరు మండలం కందుకూరు శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం హోలీ పండుగ వేడుకలను నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు ఆతర్వాత వసంతోత్సవం, చక్రస్నానం, ధ్వజ అవరోహణం, దొంగల దోపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

కొనసాగుతున్న ఎడ్ల బండలాగుడు పోటీలు

శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఎడ్లబండలాగుడు పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు జూనియర్స్ విభాగంలో ఎడ్లబండలాగుడు పోటీలు నిర్వహించారు.

రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి

ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందరావు



మాట్లాడుతున్న గోవిందరావు

బోనకల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పాలకుల రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం(ఏఐకేఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు అన్నారు. మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో శుక్రవారం జరిగిన ఆ సంఘ మహాసభలో ఆయన మాట్లాడుతూ రైతుల హక్కుల కోసం పోరాడటమే రైతుసంఘాల ధ్యేయమన్నారు. అనంతరం రైతు సంఘ మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘ నాయకులు తోట రామాంజనేయులు, జక్కుల రామారావు, పారుపల్లి నర్సింహారావు పాల్గొన్నారు.

ప్రపంచ గతిని మార్చిన కారల్ మార్క్స్

- వామపక్షాల ఆధ్వర్యంలో మార్క్స్ 142వ వర్ధంతి
- నివాళులు అర్పించిన బాగం హేమంతరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రపంచ గతిని మార్చిన మార్క్సిస్టు మేధావి కారల్ మార్క్స్ అని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు. ప్రపంచంలోని ప్రజల సమస్యలు పరిష్కారానికి మార్క్స్ సిద్ధాంతాలను అందించారని కీర్తించారు. కారల్ మార్క్స్ 142వ వర్ధంతిని శుక్రవారం సీపీఐ జిల్లా సమితి కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ 141 ఏళ్ల గడిచిన మార్క్స్ సిద్ధాంతాలు అమలు చేసేందుకు అనేక దేశాలు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. కోట్లాది మంది ప్రజలు మార్క్స్ సిద్ధాంతాలకు ఆకర్షితులైనారని తెలిపారు. ప్రపంచ దేశాలు ఆర్థికసంక్షోభంలో కూరుకుపోయిన సమయంలో మార్క్స్ సిద్ధాంతాలపై అనేక అధ్యాయాలను జరగాయని తెలిపారు. ఆర్థిక అసమానతలు లేని సమాజం కోసం ఎప్పుడు పోరాటాలు చేశారని, మతోన్మాదంపై వందేళ్ల క్రితమే హెచ్చరించారని తెలిపారు. ఎప్పటి కప్పుడు ప్రజా చైతన్యమే మార్క్సిజానికి పునాదివంటిదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కొండపర్తి గోవిందరావు, పోటు కళావతి, రావి శివరామకృష్ణ, గాదె లక్ష్మీనారాయణ, తాటి నిర్మల, మందా వెంకటేశ్వర్లు, పోటు పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, నాయకులు

కార్మిక వర్గ పోరాటాలే ఘన నివాళులు
మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

కారల్ మార్క్స్ చూపిన కార్మిక వర్గ పోరాట సిద్దాంతాలుకై పోరాటాలు చేయటం ద్వారానే కారల్ మార్క్స్‌కు ఘనమైన నివాళులు అర్పించినట్లని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పేర్కొన్నారు. శుక్రవారం సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ కార్యాలయం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో కారల్ మార్క్స్142వ వర్ధంతి కార్యక్రమంలో గుమ్మడి నర్సయ్య పాల్గొని ప్రసంగించారు. కార్మిక చైతన్యంతో సమాజంలో మార్పులు తీసుకరావాలని పిలుపునిచ్చారు. పెట్టుబడిదారి దోపిడీ విధానాలను వందేళ్ల క్రితమే మార్క్స్ తన సిద్ధాంతాల ద్వారా ప్రపంచానికి తెలిపారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆవుల అశోక్, సీవై పుల్లయ్య, శిరోమణి, ఝాన్సీ, కె. శ్రీనివాస్, ఆజాద్, వి. వెంకటేష్, లక్ష్మణ్, అశోక్, యశ్వంత్, ప్రసాద్, చిలకల నర్సింహారావు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



వైరాలో దీక్షా శిబిరంలో నాయకులు

ఎమ్మార్పీఎస్ దీక్షలు

వైరా, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వైరాలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మూడోరోజు దీక్షలు నిర్వహించారు. మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతరాములు, నాయకుడు కన్నెగంటి హుస్సేన్ ఈ దీక్షలకు సంఘీభావం తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు ఎలాంటి ప్రభుత్వ నియామకాలు చేపట్టొద్దని కోరుతూ ఈ దీక్షలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్‌నాయకులు కోట కోటి, కరిశ రమేష్, ఐనాల కనకరత్నం, కంచర్ల వెంకటేశ్వర్లు, మాగంటి బాబూరావు, మోదుగు రమేష్, తేళ్లూరి పుల్లారావు, నారపోగు లక్ష్మణ్‌రావు, గద్దల ప్రభాకర్, ఎక్కిరాల బాబూరావు, పమ్మి తిరుమలరావు, నల్లగట్ల బాబు, కన్నెగంటి పెద్ద హుస్సేన్ పాల్గొన్నారు.

శుభకార్యానికి వచ్చి వెళ్తూ అనంతలోకాలకు..

- తిరుమలకుంట వద్ద ప్రమాదం
- ఒకరు మృతి, మరో ఇద్దరికి గాయాలు
- మృతుడిది ఏలూరు జిల్లా



సంఘటన ప్రదేశంలో బాధితులు

అశ్వారావుపేటరూరల్, మార్చి14 (ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంట జరిగిన పెళ్లి వేడుకల్లో ఆనందంగా గడిపి తిరిగి ఇంటికి బయలుదేరిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన అశ్వారావుపేట మండలంలో జరిగింది. ఆంధ్రాలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం ములగలంపల్లి సమీపంలోని గంగన్నగూడెం గ్రామానికి చెందిన కొర్సా సత్తిబాబు(28), అదే ప్రాంతంలోని చల్లవారిగూడెం గ్రామానికి చెందిన మాధవ్ శ్రీనివాసరావు ద్విచక్ర వాహనంపై మండలంలోని తిరుమలకుంటలో శుక్రవారం జరిగిన వివాహానికి హాజరయ్యారు. మధ్యాహ్నం తిరిగి ఇంటికి బయలుదేరారు. ఇదే సమీపంలో వినాయకపురం వైపు నుంచి ములకలపల్లివైపుకు వెళుతున్న మరో ద్విచక్ర వాహనం తిరుమలకుంట వద్ద వీరి వీరి వాహనం ఢీకొన్నాయి. ప్రమాదంలో సత్తిబాబు తలకు బలమైన గాయాలు కావటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మాధవ్ శ్రీనివాస్‌కు స్వల్పంగా గాయాలు కాగా మరో వాహనంపై ఉన్న మనోహర్‌కు బలమైన గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను అశ్వారావుపేట ఆసుపత్రికి తరలించారు. మృతుడు సత్తిబాబుకు భార్య, ఐదు నెలల బాబు ఉన్నాడు. ఎస్‌ఐ యయాతిరాజు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

వైరాలో చోరీ

వైరా, మార్చి14 (ఆంధ్రజ్యోతి): వైరాలోని మధు జూనియర్ కళాశాల రోడ్డులో ఉన్న ఒక కిరాణ దుకాణంలో ఈనెల 12న తెల్లవారుజామున చోరీ జరిగింది. బాధితుడు కొల్లా సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేసిన సమాచారం ఆలస్యంగా తెలిసింది. వైరాలోని ప్రధాన రహదారి అయిన మధిర-జగ్గయ్యపేట రోడ్డు నుంచి మధు జూనియర్ కాలేజీకి వెళ్లే రోడ్డులో ప్రధాన రహదారి పక్కనే కిరాణ దుకాణం ఉంది. కాగా ఈ దుకాణం డోర్ నట్లు తీసివేసి రేకులు తొలగించి లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. రూ.50వేల నగదు, రూ.70వేల విలువైన సిగరెట్ పెట్టెలు ఇతర సామగ్రిని దొంగాలించారు. 11వతేదీ రాత్రి పదిగంటల వరకు దుకాణాన్ని నిర్వహించిన సత్యనారాయణ ఆతర్వాత బంద్ చేశారు. ఆతర్వాత 12న తెల్లవారుజామున 3.32 సమయంలో ముగ్గురు అగంతకులు మోటర్ సైకిల్‌పై దుకాణం వద్దకు వచ్చారు. వారిలో ఒకడు షాపులోకి ప్రవేశించాడు. మరో ఇద్దరు మోటార్ సైకిల్‌పై చుట్టూపక్కల తిరుగుతూ పహారా కాశారు. దుకాణంలోకి వెళ్లిన అగంతకుడు ఐదు నిమిషాల్లో పని పూర్తి చేసుకొని బయటపడ్డాడు. ఇవన్నీ కూడా సీసీ కెమెరాల్లో రికార్డు అయి ఉన్నాయి. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసి తనకు న్యాయం చేయాలని కోరారు.

కౌలు రైతు ప్రాణం తీసిన అప్పు



వెంకటేశ్వరరావు

ఎర్రుపాలెం, మార్చి14(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలుగుమాడులో అప్పులబాధతో ఓ కౌలు రైతు పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గురువారం జరిగింది. ఎర్రుపాలెం ఎస్‌ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. మొలుగుమాడు గ్రామానికి చెందిన తోట వెంకటేశ్వరరావు (37) సొంతంగా 2-20 ఎకరాల భూమి ఉంది. దీంతోపాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని మిరపపంట సాగుచేస్తున్నాడు. వ్యవసాయం గిట్టుబాటు కావడంలేదని అప్పు ఇచ్చిన వారు వత్తిడి తెస్తున్నారని ఈనెల7న భార్య దగ్గర వాపోయాడు. అదేరోజు పొలానికి వెళ్లి గడ్డిమందు తాగి ఆత్మహత్యయత్నం చేశాడు. పొలం నుంచి నేరుగా ఇంటికి వచ్చి ఈవిషయాన్ని భార్యకు చెప్పగా బంధువుల సాయంతో ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యఖర్చులు భరించ లేక మరుసటిరోజు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాదాపు ఏడు రోజులపాటు మృత్యువుతో పోరాడి శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య వరలక్ష్మి ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలున్నారు.

ఎస్‌ఐ రాజ్‌కుమార్‌కు ప్రశంస



పినపాక,మార్చి14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏడూళ్ల బయ్యారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న రాజ్‌కుమార్‌కు ఎస్పీ రోహిత్ రాజ్ అభినందించారు. అత్యధిక కేసుల్లో ఇరువర్గాలను సమన్వయపర్చి రాజీ కుదుర్చి పరిష్కరించడంలో చూపిన ప్రతిభకు గాను ఆయనకు ప్రశంసాపత్రం అందించారు. ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌ఐను మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఏడేళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు ఉన్నారు.

శతాధిక వృద్ధురాలి కన్నుమూత



ముదిగొండ, మార్చి14 (ఆంధ్రజ్యోతి): శతాధిక వృద్ధురాలు మృతి చెందారు. ఈ సంఘటన ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గుర్రం లచ్చమ్మ(102) అనారోగ్యంతో మృతిచెందింది. ఇప్పటివరకు తన పనులను తానే చేసుకుంటూ జీవించింది. లచ్చమ్మ మృతి పట్ల గ్రామస్థులు సంతాపం తెలిపారు.

జాతీయ రహదారిపై నేలకూలిన భారీ వృక్షం



సత్తుపల్లి, మార్చి14(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై భారీవృక్షం శుక్రవారం తెల్లవారుజామున నేలకూలింది. మండలంలోని తాళ్లమడ-బేతుపల్లి మధ్యలోని గరాఠే ఫర్నీచర్ సమీపంలో రహదారికి ఆనుకుని ఉన్న ఏళ్లనాటి వృక్షం మొదలు వరకు విరిగి రోడ్డుపైకి ఆ చెట్టు కొమ్మలు పడిపోయాయి. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో రాకపోకలకు కొద్ది గంటల పాటు ఇబ్బంది తలెత్తగా కొమ్మలుతీసివేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.గతంలో ఓ చిన్నారి తలపై చెట్టుకొమ్మ పడగా ఆసుపత్రికి తరలించేలోపే మృతి చెందింది.

పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే కోరం



కామేపల్లి, మార్చి14(ఆంధ్రజ్యోతి): ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పలు కుటుంబాలను పరామర్శించారు. రెండురోజుల క్రితం కొండాయిగూడెం పీఏసీఎస్ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు తండ్రి గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఆయనను పరామర్శించారు. వీరయ్య చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. ఇటీవల మృతి చెందిన పండితాపురం గ్రామానికి చెందిన టక్రియా, అంబడిపుడి వెంకటేశ్వర్లు కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు, గింజల నర్సింహరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య మద్దిన్ని రమేష్, గుజ్జర్లపుడి రాంబాబు పాల్గొన్నారు.

లిఫ్టులో ఇరుక్కున్న ఇద్దరు

ఖమ్మంక్రైం, మార్చి14(ఆంధ్రజ్యోతి): లిఫ్టులో ఇద్దరు ఇరుక్కుపోయిన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం ఖమ్మంలో జరిగింది. నగరానికి చెందిన శ్రీనివాస్, బిక్షం బైపాస్‌రోడ్డులోని ఓరియల్ ఎస్టేట్ కార్యాలయానికి వెళ్లేందుకు బిల్డింగ్ లిఫ్టు ఎక్కారు. రెండుఅంతస్తులు వరకు వెళ్లగానే కరెంట్‌పోయి మధ్యలోనే ఆగిపోయింది. శుక్రవారం సెలవుకావడంతో కార్యాలయంలో ఎవరు లేరని గ్రహించకుండా అక్కడకు వెళ్లడంతో సుమారు అరగంటపాటు లిఫ్టులోనే ఇబ్బందులు పడ్డారు.ఈవిషయాన్ని ఫోన్ ద్వారా సంబంధిత రియల్‌ఎస్టేట్ వారికి తెలియచేయడంతో వారు విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు.అక్కడే ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్ ప్రసాద్ సహకారంతో లిఫ్టులో ఇరుక్కున్న వారిని బయటకు తీసుకువచ్చారు.

జాడలేని ప్రమాద బీమా

- తునికాకు సేకరణలో ప్రాణాలు కోల్పోతున్న గిరిజనులు
- కాగితాలకే పరిమితమైన ప్రమాద బీమా

మణుగూరుటౌన్, మార్చి14(ఆంధ్రజ్యోతి): తునికాకు సేకరణలో ప్రాణాలు కోల్పోతున్న గిరిజనులకు ప్రమాద బీమా కానరావటం లేదు. కాగితాలకే పరిమితమవుతోంది తప్ప ఆచరణలో అమలు కావటం లేదు. కొద్ది రోజుల్లోనే తునికాకు సేకరణ ప్రారంభం కానుంది. ఈ సేకరణ సీజన్‌లో మూగ జీవాలన వలన ప్రమాదాలు జరిగిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. పొద్దున్నే చద్ది మూటను కట్టుకుని అడవులు, కొండలు, కోనలకు వెళ్లి తునికాకు సేకరణ చేస్తారు. చుట్టు అనేక ప్రమాదాలు పొంచి ఉంటాయి.క్రూరమృగాలు,విష సర్పాలు, కీటకాలు పొంచి ఉన్న వాటి మధ్యలో తునికాకును సేకరించాలి. మరోవైపు మండే ఎండలు కనుచూపు మేరలో తాగటానికి చుక్కనీరు కూడా ఉండదు. ప్రాణాలు అల్లాడిపోతుంటాయి. కొన్నిసందర్భాల్లో మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. కుటుంబాలను పోషించే



కుటుంబ లేక పోవడంతో తదనంతరం వారికి ఆసరా లేక ఆ కుటుంబాలు దిక్కులేకుండా పోతున్నాయి. పట్టించుకునే నాధుడు లేక ఆ కుటుంబాలు నానా అవస్థలు పడుతున్నారు.

బాధ్యత ఎవరిది

ప్రమాద బీమా పథకం ఉన్నప్పటికీ చాలా సందర్భాల్లో అమలు కావటం లేదు.ఈ పథకం కింద తునికాకు సేకరణలో గాయపడితే రూ.25వేలు, మృతిచెందితే రూ.లక్ష చెల్లించాలి. ఈచట్టం ఒకటి రెండుచోట్ల పోరాటాల ఫలితంగానే అమలు చేశారు. మిగిలిన చోట అసలు దీని గురించి పట్టించుకునే నాధుడు లేడనిస్థానికులు ఆరోపిస్తున్నారు.అటు కాంట్రాక్టర్ ఇటు అటవీశాఖ అధికారులు ఈ పథకం అమలుపై బాధ్యత తీసుకోవాల్సి ఉంది. లాభాలపై కాంట్రాక్టర్లు.. లక్ష్యాలపై అటవీశాఖ అధికారులు దృష్టి పెడుతున్నారే తప్ప తునికాకు సేకరించే కార్మికుల సంక్షేమంకోసంవారి భద్రత కోసం పట్టించుకుంటున్న దాఖలాలు లేవని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తునికాకు సేకరణకు ముందు ఈ పథకాలపై అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాద బీమా అమలు చేయాలి
కుర్రి నాగేశ్వరరావు, మణుగూరు సొసైటీ చైర్మన్



అధికారులు, కాంట్రాక్టర్లు ప్రమాద బీమా పథకాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలి. తునికాకు సేకరణకు వెళ్లి ప్రమాదం జరిగిన వారి కుటుంబాలకు పరిహారం అందించాలి. తునికాకు సేకరణకు ముందు తునికాకు కళ్ళాలు సేకరించే గ్రామాలలో అధికారులు ప్రజలకు ఈ పథకాలపై ప్రత్యేక అవగాహన కల్పించాలి.

ప్రజలకు అవగాహన కల్పిస్తాము, రేంజర్ ఉపేందర్



అటవీ మృగాల కారణంగా గాయపడిన వారికి ప్రమాద బీమా పథకం వర్తిస్తుంది. తునికాకు సేకరణ సమయంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రతీ గ్రామాల్లో ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పిస్తాం. తునికాకు సేకరణకు వెళ్లిన సమయంలో ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. వన్య ప్రాణుల అలజడిని గుర్తించుకుంటు జాగ్రత్తలు తీసుకోవాలి.



రేపు అథ్లెటిక్స్ ఎంపికలు

ఖమ్మంస్పోర్ట్స్‌మార్చి14(ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16న నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో అండర్-14,16,18,20 సీనియర్ మెన్, ఉమెన్స్ విభాగాల్లో అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లాఅథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎండీ షఫీక్‌అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో 100, 400 మీటర్ల పరుగు పోటీలతో పాటు జావెలిన్‌త్రో పోటీలో ఎంపికలు ఉంటాయని వారు తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసి త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ జనన ధ్రువీకరణ పత్రంతో ఆదివారం ఉదయం స్టేడియానికి చేరుకోవాలని కోరారు.

డ్రైవింగ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి,మార్చి14(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ బీసీ యువతకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ హకీంపేట నుంచి ఉచిత డ్రైవింగ్ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతులు అభివృద్ధి అధికారి జ్యోతి తెలిపారు. హెచ్‌ఎంవి(హెవీమోటర్ వాహనం), ఎల్‌ఎంవి(లైట్ మోటార్ వాహనం) 38 రోజుల శిక్షణకు దరఖాస్తులను ఈనెల 15 నుంచి 31వరకు నగరంలోని కలెక్టరేట్‌లో దరఖాస్తు అందించాలని తెలిపారు. శిక్షణ అనంతరం పర్మినెంట్ లైసెన్స్ ఉచితంగా అందిస్తారని చెప్పారు. ఆసక్తి, అర్హులైన యువత, ట్రాన్స్‌జెండర్లు సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దూరవిద్య ప్రవేశాలకు 25 వరకు గడువు

ఖమ్మంఖానాపురంహవేలి మార్చి 14(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ 2024-25 విద్యా సంవత్సరానికి రెండో విడత డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల అధ్యాయన కేంద్రం కోఆర్డినేటర్ టి.గోపి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 43 కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 25 వరకు దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

ఆదర్శ కమ్యూనిస్టు బుచ్చయ్య

తిరుమలాయపాలెం, మార్చి14(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాటంలో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన పుసులూరి బుచ్చయ్య ఆదర్శ కమ్యూనిస్టు నేత అని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకులు గుర్రం అచ్చయ్య పేర్కొన్నారు. శుక్రవారంమండలంలోని తెట్టెలపాడులో బుచ్చయ్య, అచ్చమ్మ, పేరాల రాములు, వంగూరి వెంకయ్య, పుసులూరి సత్యమయ్య, భద్రమ్మల వర్ధంతి సభలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రవన్న ట్రస్టు కార్యదర్శి పుసులూరి నరేందర్ మాట్లాడుతూ తెట్టెలపాడు, పిండిప్రోలు, దమ్మాయిగూడెం, వెంకటాయపాలెం తదితర గ్రామాల్లో ప్రజాపోరాటాలు నిర్వహించి లక్షలాది ఎకరాలను భూములును పంచిపెట్టిన యోధుడు పుసులూరి బుచ్చయ్య అన్నారు. ఈకార్యక్రమంలో సుడిగాలి కిషన్‌రావు, నెల్లూరి వెంకటేశ్వరరావు, కమ్మకోమటి నాగేశ్వరరావు, బందెల వెంకయ్య, తిమ్మిడి హనుమంతరావు, ఎస్.వెంకటేశ్వర్లు, పుసులూరి పుల్లయ్య, పుసులూరి గిరిబాబు పాల్గొన్నారు.

సీపీఎం నేతకు ఘననివాళి

తిరుమలాయపాలెం, మార్చి14(ఆంధ్రజ్యోతి): మండలంలోని జూపెడ గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు దోనేపల్లి వెంకన్నకు శుక్రవారం వివిధ పార్టీల నేతలు ఘననివాళులర్పించారు. వెంకన్న మూడో వర్ధంతి సభ శుక్రవారం జరిగింది. ఆయన చిత్రపటానికి సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను , టి.నాగేశ్వరరావు, వి.వీరన్న, బి.రమేష్, ఉపేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

ప్రజాప్రభుత్వంతోనే అభివృద్ధి

ఖమ్మంరూరల్, మార్చి14(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వంతోనే రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్ అన్నారు. మండల పరిధిలోని బారుగూడెం శ్రీసిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన అనన్య మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ప్లాంట్ యజమాని కాకాని యశంత్ చౌదరి, దివ్యశ్రీ దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ చైర్మన్ గరికపాటి వెంకట్రావు, డైరెక్టర్ గరికపాటి విజయ్,జ్యోతి దంపతులు, కాంగ్రెస్ జిల్లా నాయకులు తమ్మినేని నవీన్, విజయ్ రెడ్డి, నాగండ్ల దాసయ్య, భార్గవ్, రాజేష్, నరేష్, దావూద్, రవి తదితరులు పాల్గొన్నారు.



వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న యుగంధర్

ఆనందోత్సాహం

ఘనంగా హోలీ వేడుకలు

తిరుమలాయపాలెం,మార్చి14(ఆంధ్రజ్యోతి): హోలీ వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. చిన్నారుల యువత వేడుకల్లో పాల్గొన్నారు. సోలిపురంలో దర్గా వద్ద ముస్లింలు వేడుకలు నిర్వహించారు.

నేలకొండపల్లి: ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. మండ్రాజుపల్లిలో నేలకొండపల్లి ఎస్ఐ సంతోష్ సిబ్బందితో, అక్కడి యువకులతో కలిసి ఆట విడుపుగా క్రికెట్ ఆడారు.



ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలో వేడుకలు



రాయలకు రంగులు పూస్తున్న యువత





వేడుకల్లో పాల్గొన్న మేయర్ నీరజ, పాలెపు



సోలిపురం దర్గా వద్ద వేడుకలు జరుపుకుంటున్న ముస్లింలు







ఖైరపునిపల్లిలో హోలీ ఆడుతున్న యువకులు,తాళ్లగూడెంలో కేరింతలు కొడుతున్న యువత,28వ డివిజన్‌లో కార్పొరేటర్ గజ్జల లక్ష్మీ వెంకన్న ఆధ్వర్యంలో..

అయ్యప్ప గాయత్రి హోమం



హోమం నిర్వహిస్తున్న నంబూద్రీలు

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 10వ డివిజన్ చైతన్య నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో తక్కే కోరమంగళం దామోదరన్ నంబూద్రి, పాతికల్లం నారాయణన్ నంబూద్రి ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మహా గణపతి హోమం, అయ్యప్ప గాయత్రి హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు హనుమంతరావు, పదోడివిజన్ కార్పోరేటర్ చావా మాధురి నారాయణరావు, పుల్లంరాజు, 11వ డివిజన్ కార్పోరేటర్ సరిపూడి రమాసతీష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి14 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలపై శనివారం సాయంత్రం 4గంటల నుంచి 5 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఆర్టీసీ బస్సులకు సంబంధించి ఏమైన సూచలను. సమస్యలను 9959225958 నెంబర్‌కు ఫోన్ చేసి సమస్యలను తెలపాలని కోరారు.

వైభవంగా శ్రీరాజగోపాలస్వామి కల్యాణం



శ్రీరాజగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

నేలకొండపల్లి,మార్చి14(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లిలోని అత్యంత పురాతనమైన శ్రీరాజగోపాలస్వామి వారి దేవాలయంలో శుక్రవారం రాత్రి శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీరాజగోపాలస్వామి తిరు కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ వేడుక నిర్వహించారు. కల్యాణాన్ని అర్చకుడు ముడుంబా రామానుజాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా జరిపారు. కార్యక్రమంలో ఈఓ శ్రీకాంత్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కల్యాణానికి హాజరైన భక్తులు

కన్నులపండువగా అంకమ్మ తల్లి జాతర

ఖమ్మంఖానాపురంహవేలి, మార్చి14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 1వ డివిజన్ ఖైకోండాయిగూడెం వెళ్లే ప్రధాన రహదారి వెంట కొలువైఉన్న శ్రీ అంకమ్మ తల్లి, మహాలక్ష్మమ్మ తల్లి, మద్దిరావమ్మ అమ్మవార్ల జాతర శుక్రవారం కన్నుల పండుగగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతర మొదటి రోజు తెల్లవారుజామున 5 గంటల నుంచి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం సామూహిక కుంకమ పూజ నిర్వహించారు. అమ్మవార్లను మేయర్ నీరజ దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయం 7గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో బోనాలు వండి అమ్మవారికి సమర్పించారు. పసుపు, కుంకమ, చీరెలు, పూలు, గాజులు అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో 3, 4 వ డివిజన్ మలీదు వెంకటేశ్వర్లు, దండ జ్యోతిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు భాస్కర్‌రావు, రామాచారి, యలమంద ల రామారావు, తదితరులు పాల్గొన్నారు.





ఆలయంలో కొలువై ఉన్న అమ్మవార్లు, ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మార్క్స్ ఆశయసాధనకు కృషి చేయాలి: నున్నా

ఖమ్మం ఖానాపురంహవేలి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పెట్టుబడిదారీ విధానానికి మార్క్సిజమే సరైన మార్గమని కారల్ మార్క్స్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. కారల్ మార్క్స్ 142వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం జిల్లా కార్యాలయంలో సుందరయ్య భవన్‌లో సభ నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో నాయకులుయర్రా శ్రీకాంత్,బండి రమేష్, రవీందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోపయ్య-తిరుపతమ్మ కల్యాణం

కూసుమంచి, మార్చి14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో గోపయ్య-శ్రీలక్ష్మీతిరుపతమ్మ అమ్మవార్ల కల్యాణం వైభవంగా జరిగింది. కూసుమంచి, మల్లాయిగూడెం గ్రామాల్లో ఈ వేడుక నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చుని కల్యాణ క్రతువును నిర్వహించారు. కూసుమంచి ఆలయంలో కమిటీ చైర్మన్ దంపతులు, మల్లాయిగూడెం గ్రామంలోపలువురు దంపతులు కల్యాణం జరిపించారు. గ్రామపెద్దలు పట్టు వస్త్రాలను సమర్పించారు.



లక్ష్యం తప్పిన డీఆర్‌ఎఫ్

- ఆక్రమణలు తొలగింపుపై లేని శ్రద్ధ
- మొక్కలు నాటేందుకు, పారిశుధ్య పనులకు వినియోగం

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి14(ఆంధ్రజ్యోతి): నగరంలో డీఆర్‌ఎఫ్ బృందాల లక్ష్యం తప్పుతోంది. చేయాల్సిన పనులు వదిలి ఇతర పనులు చేయిస్తున్నారు అధికారులు.. ఖమ్మం నగరంలోని కొన్ని డివిజన్లలోని రహదారుల డ్రెయినేజీలు మరుగుదొడ్లు సైతం నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రధాన రహదారులపై అనుమతులు లేకుండా పెద్దపెద్ద హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. వేసవి కాలం రావటంతో గాలి దుమారానికి పడి పోయే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం అన్ని సెంటర్లలో ఇంటి గ్రేటెడ్ మార్కెట్‌లు ఏర్పాటు చేసిన వీధుల వెంట కూరగాయాలు అమ్మకాలు జరిపే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. దీంతో ఖమ్మం నగరంలో ట్రాఫిక్ సమస్య ఏర్పాడుతుంది. వీటన్నింటిని అడ్డుకోవాల్సిన బాధ్యత ఖమ్మం నగర పాలక సంస్థలోని డీఆర్‌ఎఫ్ బృందాలదే.. రాష్ట్ర మంత్రుల నుంచి సాధారణ ప్రజల వరకు ఖమ్మం నగరంలోని ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. డివిజన్‌ల్లోని రహదారులకు ఇరువైపులా డ్రైనేజీలపై వాహనాలకు షెడ్లు నిర్మాణాలు జరుగుతున్నాయి. పూల మొక్కలకు శాశ్విత తొట్లు నిర్మాణాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో వీటిపై ఎక్కువ ఫిర్యాదులు చేస్తున్నారు. కానీ డీఆర్‌ఎఫ్ బృందాల లక్ష్యం తప్పుతోంది. వారు చేయాల్సిన పనులు చేయకుండా సైడ్ కాల్వలు తీయించటం. ప్రధాన రహదారుల వెంట మొక్కల నాటించటం, కేఎంసీ కార్యాలయంలో సామాన్లు రవాణా చేయటం వంటి పనులకు పరిమితమైతున్నారు.ఈ విషయంపై సంబందిత అధికారుల వద్ద ప్రస్తావించగా డీఆర్‌ఎఫ్ బృందాలకు పనిలేక పోవటంతో ఖాళీగా ఉంచలేక నర్సరీ పనులు చేయిస్తున్నామని తెలిపారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య జోక్యం చేసుకొని డీఆర్‌ఎఫ్ లక్ష్యం మేరకు బాధ్యలు కేటాయించాల్సిన అవసరం ఉంది.



మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తున్న డీఆర్‌ఎఫ్ సిబ్బంది



ర్యాంకర్‌ను సన్మానిస్తున్న బీపీ నాయక్

గ్రూప్-2 ర్యాంకర్‌కు సన్మానం

బోనకల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకీపురం గ్రామంలో శుక్రవారం గ్రూప్-2 ర్యాంకర్ కోట గోపాలరావును, అతడి తల్లిదండ్రులను కాంగ్రెస్ యువనేత బీపీ నాయక్ సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన నిరుపేద విద్యార్థి గ్రూప్-2 ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచడం అభినందనీయంగా పేర్కొన్నారు. చదువుపైనే దృష్టి సారించి పలు ఉద్యోగాలకు ఎంపికైన గోపాలరావు భవిష్యత్‌లో గ్రూప్-1 ఆఫీసర్‌గా కూడా ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అనమర్తి వెంకటేశ్వరరావు, తన్నీరు నర్సింహారావు, గోగుల వెంకటేశ్వర్లు, పాపారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-3లో మెరిసిన ఉపేందర్



తల్లాడ, మార్చి14 (ఆంధ్రజ్యోతి): పట్టుబట్టి ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాలనే లక్ష్యాన్ని యువకుడు ఛేదించాడు. గ్రూప్-3లో తల్లాడ మండలం మల్లవరం యువకుడు కటికి ఉపేందర్ ప్రతిభను చాటుకున్నాడు. శుక్రవారం విడుదలైన గ్రూప్-3 ఫలితాల్లో ఉపేందర్ 384ర్యాంకు సాధించాడు. తండ్రి బాబూరావు ఉపేందర్‌కు రెండేళ్ల వయస్సున్నప్పుడు ప్రమాదవశాత్తూ మృతిచెందాడు. తల్లిసాయమ్మ, పెద్దనాన్న కటికి రాఘవరావు, పెద్దమ్మ కళావతిల ప్రోత్సాహంతో ఉపేందర్ లక్ష్యాన్ని సాధించాడు. బీటెక్ పూర్తయిన తర్వాత ఉపేందర్‌కు సాఫ్ట్‌వేర్ ఉద్యోగ అవకాశం వచ్చినప్పటికీ ఆ ఉద్యోగంలో చేరకుండా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ప్రతిభను చాటుకున్నాడు.

నికార్సయిన కార్యకర్తను కోల్పోయిన కాంగ్రెస్: పువ్వాళ్ల

మధిరటౌన్, మార్చి14(ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఓ నికార్సయిన కార్యకర్తను కోల్పోయిందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం అనారోగ్యంతో మరణించిన ఆత్మ కమిటీ డైరక్టర్, పట్టణ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆదిమూలం శ్రీనివాస్ మృతదేహాన్ని దుర్గాప్రసాద్ సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులు అర్పించిన వారిలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, మార్కెట్ కమిటి చైర్మన్ బండారు నరసింహరావు, మల్లాది వాసు, కోనా ధనికుమార్, అద్దంకి రవి, పాటిబండ్ల సత్యంబాబు, పారుపల్లి విజయ్, నవీన్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

మధిరరూరల్, మార్చి14(ఆంధ్రజ్యోతి): మధిర మండలం మాటూరు, మర్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు సత్యసాయి సేవసమితి ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. మాటూరు, మర్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో మధిర మునిసిపాలిటీ పుర ప్రముఖుడు కోనా మోహన్‌రావు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దాతలు అందించిన చేయూతను సద్వినియోగం చేసుకొని పది పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయుడు చెరుపల్లి శ్రీహరి, సేవసమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, కోనా మోహన్‌రావు, సభ్యులు భాస్కర్‌రావు, కృష్ణమూర్తి, గ్రామపెద్దలు సత్యనారాయణరాజు, పాఠశాలల ఉపాధ్యాయులు సంక్రాంతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సీపీఎం ఆధ్వర్యంలో కారల్ మార్క్స్ వర్ధంతి

కారేపల్లి, మార్చి14(ఆంధ్రజ్యోతి): మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్ 142వ వర్ధంతిని శుక్రవారం మండల సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కారేపల్లిలోని పార్టీ కార్యాలయంలో కారల్ మార్క్స్ చిత్రపటానికి సీనియర్ నాయకుడు తలారి దేవప్రకాష్ పూలమాలవేశారు. ఈసందర్భంగా మండల కార్యదర్శి కె.నరేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా కమిటీ సభ్యుడు కొండబోయిన నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కె.ఉమావతి, అన్నారపు కృష్ణ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



గోపాలరావును సన్మానిస్తున్న బీపీ నాయక్

గ్రూప్-2 ర్యాంకర్‌కు సన్మానం

బోనకల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకీపురం గ్రామంలో శుక్రవారం గ్రూప్-2 ర్యాంకర్ కోట గోపాలరావును, అతడి తల్లిదండ్రులను కాంగ్రెస్ యువనేత బీపీ నాయక్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన నిరుపేద విద్యార్థి గ్రూప్-2 ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచడం అభినందనీయంగా పేర్కొన్నారు. చదువుపైనే దృష్టి సారించి పలు ఉద్యోగాలకు ఎంపికైన గోపాలరావు భవిష్యత్‌లో గ్రూప్-1 ఆఫీసర్‌గా కూడా ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అనమర్తి వెంకటేశ్వరరావు, తన్నీరు నర్సింహారావు, గోగుల వెంకటేశ్వర్లు, పాపారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-3లో మెరిసిన ఉపేందర్



తల్లాడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పట్టుబట్టి ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాలనే లక్ష్యాన్ని యువకుడు ఛేదించాడు. గ్రూప్-3లో తల్లాడ మండలం మల్లవరం యువకుడు కటికి ఉపేందర్ ప్రతిభను చాటుకున్నాడు. శుక్రవారం విడుదలైన గ్రూప్-3 ఫలితాల్లో ఉపేందర్ 384ర్యాంకు సాధించాడు. తండ్రి బాబూరావు ఉపేందర్‌కు రెండేళ్ల వయస్సున్నప్పుడు ప్రమాదవశాత్తూ మృతిచెందాడు. తల్లి సాయమ్మ, పెద్దనాన్న కటికి రాఘవరావు, పెద్దమ్మ కళావతిల ప్రోత్సాహంతో ఉపేందర్ లక్ష్యాన్ని సాధించాడు. బీటెక్ పూర్తయిన తర్వాత ఉపేందర్‌కు సాఫ్ట్‌వేర్ ఉద్యోగ అవకాశం వచ్చింది. అయినప్పటికీ ఆఉద్యోగంలో చేరకుండా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో గ్రూప్-3కి ప్రిపేరై ప్రతిభను చాటుకున్నాడు.

స్థాయి పెరగని వైద్యం

- అప్‌గ్రేడ్‌కు నోచుకోని బోనకల్ పీహెచ్‌సీ
- ఎమర్జెన్సీ వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు
- దూర ప్రాంతాలకు వెళ్లలేక ప్రజలకు తిప్పలు
- 50 పడకల దవాఖానాగా మార్చాలని వేడుకోలు

బోనకల్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): బోనకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేయకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ప్రాథమిక వైద్యం మాత్రమే ఆరోగ్య కేంద్రంలో అందుతోందని, సర్జరీలు, మెరుగైన వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. 1987లో ఏర్పాటైన పీహెచ్‌సీని ఒక్క డాక్టర్ పోస్టుతోనే ఇప్పటి వరకు నడుపుతున్నారు. 12గంటల పాటు మాత్రమే పని చేయడంతో పాటు కేవలం ఆరు పడకలకే పరిమితం అయింది. గత ప్రభుత్వ హయంలో వైద్య, ఆరోగ్యశాఖా మంత్రి లక్ష్మారెడ్డి బోనకల్ పీహెచ్‌సీని సందర్శించిన క్రమంలో 30 పడకల ఆస్పత్రిగా మారుస్తామని హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. నేటి ప్రజాప్రభుత్వంలోనైనా పీహెచ్‌సీని 50 పడకల ఆసుపత్రిగా మార్చాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు

అత్యవసర వైద్యం కోసం ప్రజలు దూర ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. గడిచిన ఏడాది కాలంలో బోనకల్ మండలం నుంచి దాదాపు 108 వాహనం ద్వారా 1500 కేసులు ఖమ్మంలో అత్యవసర వైద్యం చేయించుకున్నట్లు సమాచారం. ఇక ప్రైవేటు వాహనాల ద్వారా వేలాది మంది జిల్లా కేంద్రానికి వెళ్తున్నారు. మండలంలో 43 వేల మంది జనాభా ఉండటంతో పాటు మోటమర్రి, కలకోట, రాపల్లి, తూటికుంట్ల, గోవిందాపురం(ఎల్), గోవిందాపురం(ఎ) తదితర గ్రామాలు జిల్లా కేంద్రంలో వైద్యం చేయించుకోవడానికి 40 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. గతంలో కలకోట గ్రామంలో ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేసి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాన్ని మంజూరు చేయాలని ఏడు గ్రామాల ప్రజలు అధికారులు, ప్రజా ప్రతినిధులకు పలుసార్లు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం దక్కలేదు. దీనికి తోడు బోనకల్ పీహెచ్‌సీని కూడ 12 గంటల ఆసుపత్రిగానే ఉంచడంతో పాటు 50 పడకల ఆస్పత్రిగా మార్చక పోవడంతో ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రులనే ఆశ్రయిస్తున్నారు. బోనకల్ పీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలందించడంతో పాటు ఆసుపత్రిని పచ్చదనంతో తీర్చిదిద్దినందున గతంలో కాయకల్ప అవార్డుతో పాటు పలు అవార్డులు ప్రశంసాపత్రాలను వైద్యులు తీసుకున్నారు. ఆసుపత్రి స్థాయిని పెంచితే కార్పొరేట్ ఆసుపత్రులను తలదన్నేలా ఇక్కడ వైద్యం అందుతుందని, ప్రజా ప్రతినిధులు స్పందిం చి 50 పడకల ఆసుపత్రిగా మార్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.



స్థాయి పెంపు కోసం ఎదురు చూస్తున్న బోనకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

అత్యవసర వైద్యం కోసం ప్రయాస

యంగల ఆనందరావు, కలకోట



ప్రజలు అత్యవసర వైద్యం కోసం జిల్లా కేంద్రంతో పాటు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. బోనకల్ పీహెచ్‌సీని 50 పడకల ఆసుపత్రిగా మార్చితే పేద, మధ్యతరగతి ప్రజలకు ఇబ్బంది లేకుండా మెరుగైన వైద్యం అందుతుంది. బోనకల్‌లో ఎటువంటి కార్పొరేట్ ఆసుపత్రులు లేక పోవడంతో ప్రస్తుతం నడుస్తున్న పీహెచ్‌సీ పైనే ప్రజలు ఆదారపడుతున్నారు. కాని 24గంటల పాటు ఆసుపత్రి నడిచేలా, ప్రస్తుతం ఉన్న 6 పడకలను 50కి పెంచితే దూర ప్రాంతాలకు వెళ్లే బాధ ప్రజలకు తప్పుతుంది.

నికార్సయిన కార్యకర్తను కోల్పోయిన కాంగ్రెస్

- డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల

మధిర టౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఓ నికార్సయిన కార్యకర్తను కోల్పోయిందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం అనారోగ్యంతో మరణించిన ఆత్మ కమిటీ డైరక్టర్, పట్టణ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆదిమూలం శ్రీనివాస్ మృతదేహాన్ని దుర్గాప్రసాద్ సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులు అర్పించిన వారిలో జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, మార్కెట్ కమిటి చైర్మన్ బండారు నరసింహరావు నాయకులు మల్లాది వాసు, కోనా ధనికుమార్, అద్దంకి రవి, పాటిబండ్ల సత్యంబాబు, పారుపల్లి విజయ్, నవీన్‌రెడ్డి, మునుగోటి, బాలరాజు ఉన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ వేడుకలు

తల్లాడ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): తల్లాడలో శుక్రవారం జనసేన ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లాడలో రోడ్డు పక్కన చెప్పులు కుట్టుకుని, తోపుడుబండ్లపై పండ్లు, కూరగాయలు అమ్ముకునే వృద్ధులకు ఎండ, వానల నుంచి రక్షణ కల్పించే గొడుగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దుగ్గిదేవర వెంకటేశ్వరరావు, తుటారి రమేష్, పూల గోపాల్, ఉప్పాల శివకృష్ణ, బీజేపీ నాయకులు గాదె కృష్ణారావు, చల్లా నాగులు పాల్గొన్నారు.

సందడిగా హోలీ వేడుకలు

- పాల్గొన్న ముువ్వా దయానంద్
- డీజే పాటలకు స్టెప్పులేసిన పోలీసులు



హోలీ సంబురాల్లో టీజీఐడీసీ చైర్మన్ మువ్వా



చిన్నారికి స్వీట్ తినిపిస్తున్న దయానంద్



కల్లూరు ఏసీపీ కార్యాలయం వద్ద ఏసీపీ, సీఐ, ఎస్‌ఐల డ్యాన్స్

సత్తుపల్లిరూరల్, మార్చి14 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలో హోలీ వేడుకలు శుక్రవారం ఘనగా జరిగాయి. యువతీయువకులు రంగులతో ముంచెత్తారు. చిన్నారులు, యువత, మహిళలు తారతమ్యం లేకుండా రంగులు ఒకరిపై ఒకరు జల్లుకుంటూ తమ సంతోషాన్ని పంచుకున్నారు. బ్యాండ్ మేళాలతో, డీజే పాటలకు నృత్యాలు చేస్తూ సంబురాల్లో మునిగి తేలారు. జలగం నగర్‌తో పాటు పలు ప్రాంతాలలో హోలీ వేడుకలకు టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. మెట్టాంజనేయ స్వామి ఆలయం సమీపంలో రాజస్థాన్ షాపుల నిర్వహకులు, వారి కుటుంబ సభ్యులతో బ్యాండ్ బాజాతో సందడి చేయగా కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొని వారితో కలిసి ఆడిపాడారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మద్యం దుకాణాలను అధికారులు మూసివేయగా బెల్ట్ షాపులలో మద్యం ఏరులై పారింది. ఇదే అదునుగా భావించి బెల్ట్ నిర్వహకులు మద్యం బాబుల నుంచి అదనంగా వసూళ్లు చేసినట్లు మద్యం బాబులు లబోదిబోమంటున్నారు.



తనికెళ్లలో హోలీ సంబురాల్లో యువత

డీజే పాటలకు స్టెప్పులేసిన పోలీసులు

కల్లూరు ఏసీపీ కార్యాలయం వద్ద ఏసీపీ అనిశెట్టి రఘు, పట్టణ సీఐ టి. కిరణ్, ఎస్‌ఐలు రఘు, వీరేందర్ డీజే పాటలకు చిన్నారులతో కలిసి స్టెప్పులేశారు. తోటి ఉద్యోగులతో కలిసి మిఠాయిలు పంచుకున్నారు.



వైరాలో..

జగదీష్ రెడ్డిపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి

- జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు



మాట్లాడుతున్న లింగాల కమల్‌రాజు

మధిరటౌన్/ ముదిగొండ, మార్చి(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి జగదీష్ రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడం అన్యాయం అని , వెంటనే ఉప సంహరించుకోవాలని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. శుక్రవారం మధిర లోని వైఎస్‌ఆర్ సర్కిల్ వద్ద జగదీష్ రెడ్డి సస్పెన్షన్‌ను వ్యతిరేకిస్తూ నిరసన తెలియజేసారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయలేని ప్రభుత్వాన్ని అసెంబ్లీ లో నిలదీస్తారనే, ప్రతిపక్షం నోరు నొక్కేందుకే సస్పెండ్ చేసారని, వెంటనే దీన్ని ఉప సంహరించుకోవాలని కోరారు.

సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీమంత్రి జగదీష్ రెడ్డిపై అసెంబ్లీలో వేసిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ముదిగొండ మండలం ముత్తారం గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట బీఆర్‌ఎస్ నాయకుల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. శాసనసభలో ప్రశ్నించే గొంతును నొక్కడం అప్రజాస్వామికమని తెలిపారు.



ముత్తారంలో బీఆర్‌ఎస్ నాయకుల నిరసన

ఈ కార్యక్రమంలో ఏఎంసి మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు బీఆర్‌ఎస్ రూరల్, పట్టణ కార్యదర్శులు బొగ్గుల భాస్కర్ రెడ్డి, అరిగె శ్రీను, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ వై. వి. అప్పారావు నాయకులు వంకాయలపాటి నాగేశ్వరరావు, ప్యారి, కటికల సత్యనారాయణ రెడ్డి, ఉమామహేశ్వర రెడ్డి , బీఆర్‌ఎస్ ముదిగొండ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, బంకా మల్లయ్య, ప్రభాకర్, శ్రీనివాసరావు, కిరణ్, ఎల్లారావు, రమేష్, రామారావు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాల నడుమ రంగుల పండగ

మధిరటౌన్, మార్చి14 (ఆంధ్రజ్యోతి): రంగుల పండగ హోలీని శుక్రవారం మధిర పట్టణంలో చిన్నా పెద్ద తేడా లేకుండాఆనందోత్సహాల నడుమ ఘనంగా జరుపుకున్నారు. యువకులు రంగులు చల్లుకుని మోటర్ సైకిళ్లపై పట్టణంలో తిరిగి సందడి చేశారు. పలు కాలనీలలో మహిళలు కూడా రంగులు చల్లుకుని హోలీ వేడుకల్లో పాల్గొన్నారు.



ఉత్సాహంగా చిన్నారులు

ఇచ్చిన మాటకు కట్టుబడని సీఎం

- ఎమ్మార్పీఎస్ మండల బాధ్యుడు ముత్తారావు



దీక్షలో కూర్చున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సత్తుపల్లి, మార్చి14 (ఆంధ్రజ్యోతి): లక్షలాది మంది మధ్యలో సాక్షిగా, నిండు అసెంబ్లీలో ఇచ్చిన మాటకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విరుద్ధంగా తీరు ఉందని ఎమ్మార్పీఎస్ మండల బాధ్యుడు గొల్లమండల ముత్తారావు అన్నారు. అసంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇచ్చిన పిలుపుమేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలు శుక్రవారంతో మూడవ రోజుకు చేరాయి. ఉద్యోగ నియామకాల్లో ఆర్డినెన్స్ తెచ్చి అయినా సరే మాదిగ బిడ్డలకు రిజర్వేషన్లు కల్పించి న్యాయం చేస్తానని సీఎం మాట ఇచ్చారని, కానీ ఇప్పుడు ఆ మాటలకు విరుద్ధంగా ప్రభుత్వం తీరు ఉందన్నారు. ఓ పక్క సమాజాన్ని నమ్మించే మాటలు చెబుతూనే ఇంకోపక్క స్వార్థపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఎప్పటికైనా ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, మాటతప్పితే మాదిగ జాతికి, ఉప కులాలకు శత్రువుగా మిగులుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో దువ్వూరి రమేష్, గోళ్ల మూడి శ్రీనివాసరావు, పరిగడపు లక్ష్మణ్, గంధం రాఘవ, రాము పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

మధిర రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం మాటూరు, మర్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు సత్యసాయి సేవసమితి ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని శుక్రవారం పంపిణీ చేశారు. మాటూరు, మర్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో మధిర మునిసిపాలిటీ పుర ప్రముఖుడు కోనా మోహన్‌రావు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దాతలు అందించిన చేయూతను సద్వినియోగం చేసుకొని పది పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెరుపల్లి శ్రీహరి, సేవసమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, కోనా మోహన్‌రావు, సభ్యులు భాస్కర్‌రావు, కృష్ణమూర్తి, గ్రామపెద్దలు సత్యనారాయణ రాజు, పాఠశాలల ఉపాధ్యాయులు సంక్రాంతి శ్రీనివాసరావు, మేడేపల్లి శ్రీనివాసరావు, షేక్ ఇబ్రహీం, యరమల కోటిరెడ్డి, ఈ.వీరయ్య, పీడీ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.



మర్లపాడు పాఠశాలలో..



మాటూరు పాఠశాలలో...

'మునిసిపల్ కార్మికుల వేతనాలు చెల్లించాలి '

మధిరటౌన్,మార్చి(ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి వెంటనే జీతాలు చెల్లించాలని సీపీఐ జిల్లా నాయకుడు బెజవాడ రవి డిమాండ్ చేశారు. శుక్రవారం మధిర లోనిసీపీఐ కార్యాయంలో జరిగిన ఏఐటీయూసీ అనుబంధ సంఘమైన మునిసిపల్ కార్మికుల మహాసభలో ఆయన మాట్లాడారు. గత పాలకవర్గం, గత కమిషనర్ నిర్లక్ష్యం వలన కార్మికుల పీఎఫ్, ఈఎస్‌ఐ బకాయలు చెల్లించక పోవడం వలన కార్మికులు నష్టపోయారని అన్నారు. ప్రస్తుత కమిషనర్ అయినా పెండింగ్‌లో ఉన్న జీతాలు, బకాయలు చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా 15 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు అధ్యక్షుడిగా చటారి నాగేంద్రం, కార్యదర్శిగా నరేష్, కోశాధికారిగా బాబును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి చెరుకూరి వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బెజవాడ రవి